క్లుప్తంగా

పలువురి బైండోవర్

వేలేరు : అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పలువురు మాజీ మావోయిస్టులు, రౌడీషీటర్లను తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్సై హరిత సోమవారం వెల్లడించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. కాగా బైండోవర్ అయిన కొయ్యడ శంకర్, పులి శ్రీనివాస్, యాదగిరి మాట్లాడుతూ.. 20 ఏళ్ల క్రితం కడియం శ్రీహరి తమపై మావోయిస్టు సానుభూతిపరులనే ఆరోపణలతో అక్రమ కేసులు పెట్టించారని, ప్రస్తుతం ఘన్‌పూర్ ఎమ్మెల్యేగా కడియం శ్రీహరి పోటీ చేస్తుండటంతో పోలీసులు తమను బైండోవర్ పేరుతో వేధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

రేపు విద్యుత్ వినియోగదారుల లోకల్ కోర్టు

ధర్మసాగర్: / ఐనవోలు: ఈ నెల 8వ తేదీన పంతినిలోని 33/11 కేవీ సబ్‌స్టేషన్ ఆవరణలో విద్యుత్ వినియోగదారుల లోకల్ కోర్టు ఏర్పాటు చేయనున్నట్లు విద్యుత్ శాఖ హనుమకొండ రూరల్ ఏడీ దానయ్య, ఏఈ సుధాకర్ సోమవారం ప్రకటనలో తెలిపారు. లోకల్ కోర్టులో విద్యుత్ పునరుద్ధరణ, కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్ల మార్పిడి, ఓల్టేజి హెచ్చుతగ్గులు, డిస్ట్రిబ్యూషన్ సిస్టం పెంపుదల, లోపాలు ఉన్న మీటర్లు మార్చడం, నూతన సర్వీస్‌ల మంజూరు, అదనపు లోడ్ క్రమబద్ధీకరణ, సర్వీస్ పేరు మార్పిడి, కేటగిరి మార్పు, సర్వీస్ రద్దు వంటి సమస్యలను పరిష్కరించనున్నట్లు తెలిపారు. సమస్యలున్న విద్యుత్ వినియోగదారులు రాతపూర్వకంగా ఫిర్యాదులు అందించాలని పేర్కొన్నారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 01 గంట వరకు ఫిర్యాదులు స్వీకరించనున్నట్లు వెల్లడించారు.

ఉపాధ్యాయులను నియమించాలి



శాయంపేట : మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో సాంఘికశాస్త్రం, గణితం సబ్జెక్టులను బోధించేందుకు ఉపాధ్యాయులను నియమించాలని విద్యార్థుల తల్లిదండ్రులు సోమవారం ఎంపీడీఓ ఆమంచ కృష్ణమూర్తికి వినతిపత్రం అందించారు. స్పందించిన ఆయన ఎంఈఓ, డీఈఓకు సమాచారం అందించి ఉపాధ్యాయులను నియమించే విధంగా కృషి చేస్తానని అన్నారు. ఈ సందర్భంగా ఎంఈఓ రమాదేవికి ఫోన్ ద్వారా ఉపాధ్యాయులను నియమించాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు తల్లిదండ్రులు రవీంద్రాచారి, రఘు, రమేష్ ఉన్నారు.

రెండు నామినేషన్లు

కమలాపూర్: హుజూరాబాద్ నియోజకవర్గంలో జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు మండలానికి చెందిన ఇద్దరు అభ్యర్థులు సోమవారం నామినేషన్లు దాఖలు చేసినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, హుజూరాబాద్ ఆర్డీ రాజు తెలిపారు. కమలాపూర్‌కు చెందిన శనిగరపు రమేష్‌బాబు బలిరాజా పార్టీ తరఫున నామినేషన్ దఖలు చేయగా, స్వతంత్ర అభ్యర్థిగా బండి శ్రీనివాస్ నామినేషన్ దాఖలు చేసినట్లు పేర్కొన్నారు. కాగా సోమవారం ఒక్క రోజే ఐదు నామినేషన్లు దాఖలైనట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి తెలిపారు.

మల్లన్న ఆలయంలో మంత్రి పూజలు



ఐనవోలు: మండలంలోని శ్రీమల్లికార్జునస్వామి ఆలయంలో రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారిని దర్శించుకున్న ఆయన పాలకుర్తి అసెంబ్లీ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేయనున్న నామినేషన్ పత్రాలను మల్లన్న పాదాల వద్ద ఉంచి ప్రత్యేక పూజలు చేశారు.

ఓటుతోనే ప్రశ్నించే హక్కు



హన్మకొండ: ఓటు హక్కును వినియోగించుకోకపోతే ప్రశ్నించే హక్కును కోల్పోవడమేనని అనురాగ్ హెల్పింగ్ సొసైటీ అధ్యక్షురాలు, నేషనల్ కన్జూమర్ రైట్స్ కమిషన్ ఉపాధ్యక్షురాలు డాక్టర్ కే.అనితారెడ్డి అన్నారు. హనుమకొండ కేఎల్ఎన్ రెడ్డి కాలనీలోని స్వధార్ మహిళా ఆశ్రమంలో ఓటు విలువపై మహిళలకు సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలందరి భాగస్వామ్యంతో నగరంలో నూరుశాతం ఓటింగ్ జరిగే విధంగా కృషి చేయాలని కోరారు. ఈక్రమంలో ఓటుహక్కు ఉన్న వారంతా విధిగా వినియోగించుకోవాలని చెప్పారు.

సృజనాత్మకతను వెలికి తీసేందుకు

‘సాక్షి స్పెల్‌బీ’ దోహదం



స్పెల్‌బీ పరీక్ష రాస్తున్న షైన్ హైస్కూల్ విద్యార్థులు



స్పెల్ బీ పరీక్ష రాస్తున్న రామన్ హైస్కూల్ విద్యార్థులు

హన్మకొండ: విద్యార్థుల్లో దాగిఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు ‘సాక్షి స్పెల్‌బీ’ ఎంతగానో దోహదపడుతుందని సాక్షి దినపత్రిక వరంగల్ యూనిట్ బ్రాంచీ మేనేజర్ శ్రీనివాస్ అన్నారు. సాక్షి ఆధ్వర్యంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని భవిష్య హైస్కూల్, షైన్‌గ్రూప్ ఆఫ్ స్కూల్స్, తాళ్ల పద్మావతి గ్రూప్ ఆఫ్ స్కూల్స్, బిర్లా ఓపెన్ మైండ్ ఇంటర్నేషనల్ స్కూల్, సెయింట్ పీటర్స్ సెంట్రల్ పబ్లిక్ స్కూల్, రామన్ హైస్కూల్, స్టాండర్డ్ హైస్కూళ్లలో స్పెల్ బీ ప్రాథమిక స్థాయి పరీక్షను సోమవారం నిర్వహించారు. ఈ పరీక్షకు పలు పాఠశాలల నుంచి పలువురు విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభా పాటవాలను పరీక్షించుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ పోటీ పరీక్షలో పాల్గొనాలనే ఆసక్తి గల విద్యార్థులు 95055 14424 నంబర్‌లో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో సాక్షి బ్యూరో ఇన్‌చార్జ్ గడ్డం రాజిరెడ్డి, ఈవెంట్స్ మేనేజర్ ఎన్.సుమన్ గుప్తా, ఎడిషన్ ఇన్‌చార్జ్ లింగయ్య, సాక్షి బృందం సభ్యులు పాల్గొన్నారు. కాగా, స్పెల్‌బీ పరీక్షలో పాల్గొన్న విద్యార్థులు తమ అభిప్రాయాలను సాక్షితో పంచుకున్నారు.

జిల్లా స్థాయి పోటీల కోసం ప్రయత్నిస్తా..



సాక్షి ప్రాథమిక స్థాయి స్పెల్‌బీ పోటీ పరీక్షలో పాల్గొన్న అనుభవంతో జిల్లా స్థాయిలోకి వెళ్లేందుకు ప్రయత్నిస్తా. సాక్షి దినపత్రిక నిర్వహిస్తున్న స్పెల్ బీ పరీక్షల్లో పాల్గొనడంతో పోటీ పరీక్షలంటే భయం పోయింది.

– ఆరాధ్య, 7వ తరగతి, బిర్లా ఓపెన్ మైండ్స్ స్కూల్

మొదటిసారి పరీక్ష రాశా..



సాక్షి స్పెల్‌బీ పరీక్షను తొలిసారి రాశాను. నాకు చాలా ఆనందంగా ఉంది. ఈ ప్రాథమిక పరీక్షలో నెగ్గి జిల్లా స్థాయికి ఎంపిక అవుతాననే నమ్మకం కూడా ఉంది. ఇలాంటి పరీక్ష నిర్వహించినందుకు సాక్షికి కృతజ్ఞతలు.

– అద్వైత్, 4వ తరగతి, స్టాండర్డ్ హైస్కూల్

ప్రతీ విషయంపై పట్టు



సాక్షి స్పెల్‌బీ పరీక్ష రాయడం వల్ల కొత్త విషయాలు తెలిశాయి. ప్రతీ విషయంపై పట్టు ఎలా సాధించాలో అవగతం అయింది. భవిష్యత్తులో పోటీ పరీక్షలు, ఉన్నత చదువులకు ఈ పరీక్ష ఎంతగానో దోహదపడుతుంది.

– రితుష్నా రెడ్డి, 3వ తరగతి, సెయింట్ పీటర్స్ స్కూల్

ఆంగ్లమంటే భయం పోతుంది



ఇలాంటి పోటీ పరీక్షల్లో పాల్గొనడం వల్ల ఆంగ్లమంటే భయం పోతుంది. సాక్షి స్పెల్‌బీ పరీక్ష సృజనాత్మకతను వెలికితీసేందుకు ఉపయోగపడుతుంది. విద్యార్థులకు ఎంతగానో దోదహపడుతుంది.

– గయాసుద్దీన్, 6వ తరగతి, షైన్ హైస్కూల్

పరీక్షతో ఉత్సాహం పెరిగింది



సమాజంలో పోటీ అనేది ఏ స్థాయిలో ఉంటుందో స్పెల్‌బీ ద్వారా అర్థం అయింది. పైస్థాయిలోకి చేరుకుంటే ఉత్సాహం పెరిగి మరింత శ్రద్ధ పెట్టేందుకు వీలు అవుతుంది. మంచి ఫలితం సాధించేందుకు బాగా కష్టపడాలి.

– సమన్వి, 4వ తరగతి, తాళ్ల పద్మావతి స్కూల్

తల్లిదండ్రులు ప్రోత్సహిస్తున్నారు..



స్పెల్‌బీ పరీక్షల్లాంటివి రాయడం వల్ల మంచి భవిష్యత్ ఉంటుందని నమ్మకం. ఆ నమ్మకంతో మా తల్లిదండ్రులు ప్రోత్సహిస్తున్నారు. ఇలాంటి పరీక్షల వలన ఇంగ్లిష్ నేర్చుకోవాలనే ఉత్సాహం కూడా పెరుగుతుంది.

– అనన్య 9వ తరగతి, భవిష్య హైస్కూల్

అర్హులందరికీ ఉపాధి కల్పించాలి

● డీఆర్‌డీఓ శ్రీనివాస్‌కుమార్



మాట్లాడుతున్న డీఆర్‌డీఓ శ్రీనివాస్‌కుమార్

కమలాపూర్: మండలంలో చేపట్టే ఉపాధిహామీ పనుల్లో జాబ్‌కార్డు కలిగిఉన్న ప్రతిఒక్కరికీ పని కల్పించాలని డీఆర్‌డీఓ శ్రీనివాస్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని రైతువేదికలో సోమవారం ఈజీఎస్ సిబ్బందితో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఉపాధి హామీ పథకంలో చేపట్టిన నర్సరీలు, వాటి రికార్డుల నిర్వహణ త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. గ్రామంలో ప్రతిరోజూ కనీసం 50 మంది కూలీలకు తగ్గకుండా ఉపాధి కల్పించాలని అన్నారు. అనంతరం 2022 ఏప్రిల్ 1వ తేదీ నుంచి 2023 మార్చి 31 వ తేదీ వరకు మండలంలో జరిగిన రూ.5.22 కోట్ల ఉపాధి హామీ పనులకు సంబంధించి 14వ విడత సామాజిక తనిఖీ నివేదిక నిర్వహించారు. సామాజిక తనిఖీ నివేదిక సందర్భంగా రికార్డుల నిర్వహణ సరిగా లేని పంచాయతీ కార్యదర్శులకు రూ.వెయ్యి జరిమానా విధించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీఆర్‌డీఓ శ్రీనివాస్‌రావు, ఎంపీడీఓ బాబు, ఎంపీఓ విమల, డీపీఓ నర్సింహారెడ్డి, అంబుడ్స్‌మెన్ నాగరాజు, క్యూసీ శ్రీనివాస్, సామాజిక తనిఖీ ఎస్పీఎం వేణు, ఎస్సార్పీ సురేందర్, ఏపీఓ రమేష్, అన్ని గ్రామాల డీఆర్పీలు, పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పురుగుమందు పిచికారీలో జాగ్రత్తలు పాటించాలి



మాట్లాడుతున్న మెడికల్ ఆఫీసర్ సాయికృష్ణ

శాయంపేట : రైతులు తమ పంటపొలాల్లో పురుగు మందులు పిచికారీ చేసే సమయంలో జాగ్రత్తలు పాటించాలని మెడికల్ ఆఫీసర్ సాయికృష్ణ అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రజ్వల్ రైతు ఉత్పత్తిదారుల సంఘం (హెచ్‌అండ్‌ఎంప్రాజెక్టు) అసోసియేట్ మేనేజర్ అక్కల రమేష్ సోమవారం వైద్య సిబ్బందికి, ఆశ వర్కర్లకు సమావేశం ఏర్పాటు చేయగా ఆయన పాల్గొని మాట్లాడారు. మహిళలు అనేక ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నారని, దీనికి ముఖ్య కారణం రైతులు పంటలకు వాడుతున్న రసాయనాలే అన్నారు. పొలాల్లో పురుగు మందులు పిచికారి చేసే సమయంలో జాగ్రత్తలు పాటించాలని, లేనిపక్షంలో ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని అన్నారు. పురుగు మందులు పిచికారి చేసేముందు పీపీఈ కిట్లను ధరించాలని సూచించారు. రైతులకు అవగాహన కల్పించేందుకు ప్రజ్వల్ క్షేత్రసిబ్బంది, ఆశ కార్యకర్తలతోనే ద్వారానే సాధ్యమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పీయూ మేనేజర్ ప్రియాంకరెడ్డి, సిబ్బంది రాంబాబు, తిరుపతి, సునీల్, కల్పన పాల్గొన్నారు.

విశ్వరూప మహాసభను జయప్రదం చేయాలి



దామెర: కరపత్రం ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు



పరకాల: కరపత్రం ఆవిష్కరిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

దామెర: మాదిగల హక్కుల సాధన, సమస్యల పరిష్కారం కోసం సికింద్రాబాద్‌లో ఈనెల 11వ తేదీన నిర్వహించతలపెట్టిన మాదిగ విశ్వరూప మహాసభను జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు గోవిందు రవికుమార్ పిలుపునిచ్చారు. ఈ మేరకు మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద కరపత్రం ఆవిష్కరించి మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ ధ్యేయంగా 29 ఏళ్లుగా మందకృష్ణ ఆధ్వర్యంలో అలుపెరుగని పోరాటం చేస్తున్నామన్నారు. విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో మాదిగ, ఉపకులాల వర్గాలకు అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యమంలో భాగంగా విశ్వరూప మహాసభ నిర్వహిస్తున్నామని, మాదిగ, ఉపకులాలకు చెందిన ప్రతిఒక్కరూ అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. గోవిందు కమలాకర్, ఎంఎస్ఎఫ్ ఇంచార్జ్ పరిమళశ్రీధర్, గజ్జిప్రదీప్, ఇసాక్, రాజేందర్, కిరణ్, వినీల్ పాల్గొన్నారు.

పరకాల: ఎస్సీ వర్గీకరణ సాధించుకునేందుకు మాదిగలందరూ ఉద్యమించాలని బీఆర్ఎస్ నాయకుడు సోదా రామకృష్ణ పిలుపునిచ్చారు. ఈ నెల 11వ తేదీన రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో నిర్వహించనున్న మాదిగల విశ్వరూప కరపత్రాన్ని సోమవారం ఆయన ఆవిష్కరించారు. దేశంలో మొదటిసారి కులసంఘం సభకు ప్రధాని నరేంద్ర మోదీ హాజరుకావడం గొప్ప విషయమన్నారు. మాదిగ బిడ్డలందరూ తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి జిల్లెల మురళి, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు మడికొండ శ్రీను, రాజు, గోవిందు, మహిపాల్, సుమన్, చింటు, కిషన్, సమ్మయ్య పాల్గొన్నారు.

బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల్లో చేరికలు



దామెర : బీఆర్ఎస్‌లో చేరుతున్న హమాలీ సంఘం నాయకులు



శాయంపేట : బీజేపీలో చేరుతున్న నాయకులు

దామెర: మండలంలోని కోగిల్వాయి గ్రామానికి చెందిన హమాలీ సంఘం నాయకులు సోమవారం బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి కండువా కప్పి ఆహ్వానించారు. సంఘం అధ్యక్షుడు నీల ఓదేలు, ఉపాధ్యక్షుడు సాధు రాజు, కార్యవర్గ సభ్యులు రఘుపతి, అనిల్, శ్రీనివాస్, ప్రవీణ్, కార్తీక్, వెంకటేశ్, వినయ్, రవి, కిషన్, రాజు, కేశవులు, సుదర్శన్, ఎల్లయ్య, రవి, శశికుమార్, దుర్గెందర్, వేణు పార్టీలో చేరిన వారిలో ఉన్నారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నడికూడ: మండలంలోని చర్లపల్లి, నర్సక్కపల్లి గ్రామాలకు చెందిన కాంగ్రెస్, బీజేపీ నాయకులు సోమవారం బీఆర్ఎస్‌లో చేరారు. వారికి ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి కండువా కప్పి ఆహ్వానించారు.

ఆత్మకూరు : మండలంలోని చౌళ్లపల్లిలో వివిధ పార్టీలకు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు సోమవారం బీజేపీలో చేరారు. వారికి ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ పగడాల కాళీప్రసాద్ కండువా కప్పి ఆహ్వానించారు.

శాయంపేట : మండలంలోని నూర్జహాన్‌పల్లి గ్రామానికి చెందిన వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు సోమవారం బీజేపీలో చేరారు. ఆ పార్టీ మండల అధ్యక్షుడు గడ్డం రమేష్ కండువా కప్పి ఆహ్వానించారు. ఆ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

కొండచిలువల సంచారం

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిసరాల్లో పలు కొండచిలువలు సంచరిస్తున్నాయి. ఆదివారం రాత్రి ఓ కొండచిలువ క్యాంపస్‌లోని ఫార్మసీ కళాశాల – జియాలజీ విభాగం మధ్యలో సంచరిస్తున్న సమయంలో ప్రొఫెసర్ సమ్మయ్య, పలువురు వాకర్స్ చూశారు. ఫిజికల్ ఎడ్యుకేషన్ హాస్టల్ – క్వార్టర్స్ మధ్యలో కూడా గతంలో కొండచిలువలు ప్రత్యక్షమయ్యాయి. బయో టెక్నాలజీ, కెమిస్ట్రీ, ఇలా పలుచోట్ల కొండ చిలువలు సంచరించటంతో విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారు. యూనివర్సిటీ అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీసేందుకే పోటీలు



ఐనవోలు : జిల్లాస్థాయికి ఎంపికైన విద్యార్థులతో హెచ్‌ఎం



కమలాపూర్ : పాఠశాలలో కళా ఉత్సవాలను నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు



ధర్మసాగర్ : హస్తకళ ప్రదర్శనను తిలకిస్తున్న విద్యార్థులు, తదితరులు

ఐనవోలు: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న 9,12వ తరగతి విద్యార్థుల్లో దాగివున్న కళారంగం ప్రతిభను వెలికితీసేందుకే పోటీలు నిర్వహించినట్లు కాంప్లెక్స్ ఇన్‌చార్జ్ హెచ్‌ఎం శ్రీహర్షుడు తెలిపారు. ఈ మేరకు సోమవారం కళారంగం పోటీలు నిర్వహించారు. సాంప్రదాయ పాటల విభాగంలో కేజీబీవి పాఠశాలలో 9వ తరగతి విద్యార్థిని ఎస్ పూజిత, ఫోక్ సాంగ్స్ విభాగంలో ఒంటిమామిడిపల్లి జెడ్పీహెచ్ఎస్ 9వ తరగతి విద్యార్థి ఎం శ్యామ్, కేజీబీవి పదోతరగతి విద్యార్థిని జి అశ్విత, సాంప్రదాయ నృత్యం విభాగంలో కేజీబీవీ 9వ తరగతి విద్యార్థిని సీహెచ్ కావిక, ఫోక్ డ్యాన్స్ విభాగంలో సింగారం జెడ్పీహెచ్ఎస్ 9వ తరగతి విద్యార్థిని ఎం సిరి, త్రీ డైమెన్షన్ విజువల్ ఆర్ట్ విభాగంలో కేజీబీవి 10వ తరగతి విద్యార్థిని ఎస్ హర్షిణి, ఇండీజీనియస్ విభాగంలో కేజీబీవి 10వ తరగతి విద్యార్థిని డి శ్రావణి, ఏకపాత్రాభినయం విభాగంలో కేజీబీవి 10వ తరగతి విద్యార్థిని ఎస్ అక్షయ ప్రతిభ కనబర్చినట్లు తెలిపారు. దీంతో వారిని జిల్లాస్థాయికి ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థిని, విద్యార్థులు జిల్లా స్థాయిలో సత్తా చాటాలని ఉపాధ్యాయులు సూచించారు. నేటితరం విద్యార్థులు కళారంగంపై అవగాహన పెంచుకోవాలని, వాటి వలన కలిగే ప్రయోజనాలను తెలుసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కంప్యూటర్ అసిస్టెంట్ సెక్రటరి శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయులు, సీఆర్పీ రాజ్‌కుమార్ విద్యార్థులు పాల్గొన్నారు.

కమలాపూర్‌లో..

కమలాపూర్: మండల కేంద్రంలోని ఎంజేపీ బాలికల గురుకుల పాఠశాలలో సోమవారం మండల స్థాయి కళాఉత్సవ పోటీలు ఘనంగా నిర్వహించారు. ఈ పోటీల్లో మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో 9 నుంచి 12వ తరగతి చదువుతున్న విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభ కనబర్చారు. గెలుపొందిన విద్యార్థులు ఈ నెల 9, 10వ తేదీల్లో జిల్లా స్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొననున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎంలు రాజమల్లయ్య, పవన్‌కుమార్, ప్రిన్సిపాల్ ప్రఫుల్లాదేవి, ఎంఎన్ఓ శ్రీధర్, కరుణాకర్, ఉపాధ్యాయులు శంకరాధిత్య, ప్రకాశ్‌బాబు, సీఆర్పీలు సుభాష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ధర్మసాగర్‌లో..

ధర్మసాగర్: అంతరించిపోతున్న హస్తకళలను కాపాడుకోవాలని డిజైనర్ ఫర్ హ్యాండీక్యాప్ సెంటర్ ప్రతినిధి రాజేష్ అన్నారు. మండలంలోని పెద్దపెండ్యాల జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ఇన్‌చార్జ్ హెచ్‌ఎం శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం జౌళీశాఖ వారి హస్తకళ అభివృద్ధి సంస్థ సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హస్తకళ వలన కలిగే ఉపయోగం గురించి విద్యార్థులకు వివరించారు. తెలంగాణలోని ఐదు హస్తకళలను ప్రదర్శించి విద్యార్థులకు వివరించారు. ప్రతీ విద్యార్థి హస్తకళ గురించి తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంటీఎస్ఆర్ వెంకటేశ్వర్లు, హ్యాండీక్యాప్ సర్వీస్ సెంటర్ వరంగల్ ప్రతినిధి విమల, టాటింగ్‌లేస్ మాధవి, ఎంబ్రాయిడింగ్ ప్రసాద్, పీపుల్ లీప్ పేయింటర్ రేణుక, బ్రాషిట్ కవిత, బాబిన్‌లేస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

19న పునఃప్రతిష్ఠాపన మహోత్సవం



ముఖ్యనాథస్వామి ఆలయ ఆవరణంలో ఆహ్వాన పత్రం ఆవిష్కరిస్తున్న ఆలయ చైర్మన్, తదితరులు

ధర్మసాగర్: మండలంలోని ముప్పారంలో ముఖ్యనాథస్వామి దేవాలయం పునఃప్రతిష్ఠాపన మహోత్సవాన్ని ఈనెల 19వ తేదీన నిర్వహించనున్నట్లు దేవస్థానం పునర్నిమాణ వ్యవస్థాపకుడు, ఆలయ చైర్మన్ శివసాని రవీంద్ర తెలిపారు. ఈ మేరకు ఆలయ ప్రాంగణంలో సోమవారం ఆహ్వాన పత్రిక ఆవిష్కరించి మాట్లాడారు. ఈ నెల 17,18,19 తేదీల్లో పునఃప్రతిష్ఠపన మహోత్సవానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. సర్పంచ్ గోనెల సమ్మక్కరాజయ్య, ఉపసర్పంచ్ వేములకొండ రజిత, మాజీ ఎంపీటీసీ మేకల విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రచారాలు ముమ్మరం..

కమలాపూర్/ఎల్కతుర్తి/పరకాల : అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఆయా పార్టీల అభ్యర్థులు ప్రచారాలు ముమ్మరం చేశారు. కమలాపూర్ మండలంలోని బత్తినివానిపల్లి ఆంజనేయస్వామి దేవాలయంలో కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వొడితల ప్రణవ్ సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించి ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. అలాగే ఎల్కతుర్తి మండలం సూరారం, దండేపల్లి, వీరనారాయణపూర్, కోతులనడుమ, వల్బాపూర్ గ్రామాల్లో హుస్నాబాద్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి, మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్‌గౌడ్ విజయభేరి యాత్ర చేపట్టి ప్రచారం నిర్వహించారు. అదే విధంగా కమలాపూర్ మండలంలోని గుండేడు, కొత్తపల్లి, కన్నూరు, భీంపల్లి గ్రామాల్లో ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డి ఎన్నికల ప్రచారం చేశారు. పరకాల మండలం నాగారం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి రేవూరి ప్రకాశ్‌రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కమలాపూర్ మండలంలోని గోపాల్‌పూర్, శనిగరం, మాదన్నపేట, గూనిపర్తి, శ్రీరాములపల్లి, అంబాల గ్రామాల్లో బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఈటల రాజేందర్‌కు మద్దతుగా ఆయన సతీమణి జమున ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

పల్లెల్లో ఎన్నికల సందడి



పరకాల: ఆయా పార్టీలు చేపట్టిన ఎన్నికల ప్రచారం ఊపందుకోవడంతో గ్రామాల్లో సందడి నెలకొంది. పల్లెల్లోని ప్రజలు కూలీ పనులు వదిలిపెట్టి ఎన్నికల ప్రచారానికి ఉత్సాహంగా తరలివస్తున్నారు. నాగారం లో ఓ రాజకీయ పార్టీ ప్రచారానికి ప్రజలు తరలిరాగా ఎన్నికల కోలాహలం నెలకొంది.